## క్లుప్తంగా

### గండితో వర్షం నీరు తొలగింపు



గోపన్నపాలెంలో గండి ఏర్పాటు చేసి వరద నీటిని దిగువ ప్రాంతానికి తరలిస్తున్న దృశ్యం

**దెందులూరు:** గోపన్నపాలెంలో ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాలలో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కళాశాల గ్రౌండ్ మొత్తం చెరువులా మారింది. 400 మంది బీపీఈడీ, డీపీఈడీ విద్యార్థులు, కళాశాల సిబ్బంది అవసరాలు దృష్టిలో పెట్టుకుని గోపన్నపాలెం ఎంపీటీసీ ఏనుగు అంజలి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నేత ఏనుగు ప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏనుగు రామకృష్ణలు సంయుక్తంగా శుక్రవారం గండికొట్టారు. గండి ద్వారా కళాశాలలోని వర్షపునీటిని దిగువన ఉన్న చెరువులోకి పంపుతున్నారు. సహాయక చర్యలను సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ పరిశీలించారు. వందలాది మంది విద్యార్థులకు ఉపయోగపడే మేలైన చర్యలను చేస్తున్న ఎంపీటీసీ ఏనుగు అంజలి, వైఎస్సార్ సీపీ నేత ఏనుగు ప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఏనుగు రామకృష్ణను, సర్పంచ్ అభినందించారు.

### ఒకే ఈతలో కవల దూడల జననం



భీమడోలులో కవల దూడలతో రైతు

**భీమడోలు:** భీమడోలు హైస్కూలు రోడ్డులో శుక్రవారం గ్రామానికి చెందిన రైతు బాతా నాగరాజు ఇంట్లోని గేదె ఒకే ఈతలో కవల దూడలకు జన్మనిచ్చింది. కవల దూడలు పుట్టడం జన్యుపరంగా జరిగే అరుదైన ఘటనగని పశుసంవర్ధక శాఖ భీమడోలు అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ తెలిపారు. ఈ రైతుకు చెందిన ఈ గేదె తొలి రెండు ఈతల్లో ఒక్కో దూడకు జన్మనివ్వగా మూడో ఈతలో కవల దూడలు పుట్టడంతో ఆ రైతు ఇంట ఆనందానికి హద్దుల్లేవు. రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని పశు సంవర్థక శాఖ ఏడీ పేర్కొన్నారు.

### జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా రాజు

**గణపవరం:** గణపవరం ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపల్‌గా ఆకాలేజి గణిత అధ్యాపకుడు యు.రామచంద్రరాజు పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. శుక్రవారం ఆర్జేడీ నియామక ఉత్తర్వులు ఇచ్చారని రామచంద్రరాజు తెలిపారు. ఆయన శుక్రవారం సాయంత్రం కాలేజి ప్రిన్సిపల్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. రామచంద్రరాజుకు కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

### శంకుస్థాపనలు వాయిదా

**దెందులూరు:** దెందులూరు పెదదళితవాడలో శనివారం జరగాల్సిన శంకుస్థాపనలు వాయిదా వేసినట్టు వైఎస్సార్ సీపీ దెందులూరు గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు తెలిపారు. అధికారులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు శంకుస్థాపనల వాయిదా విషయాలను గమనించాలని ఆయన కోరారు.

### కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం సీజ్

**పెదపాడు:** కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పెదపాడు పోలీసులు శుక్రవారం తెలిపారు. పెదపాడు గ్రామం వైపు వస్తున్న వాహనంతో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి అడ్డుకున్నట్టు ఎస్సై తెలిపారు. కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, వాహనం సీజ్ చేసినట్లు పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.

### రాష్ట్ర రైతు సదస్సుపై పోస్టర్ ఆవిష్కరణ

**ఉంగుటూరు:** రాష్ట్ర రైతు సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కౌలురైతు సంఘం అధ్యక్షుడు కోర్ని అప్పారావు కోరారు. కైకరంలో శుక్రవారం వాల్‌పోస్టర్‌ను రైతు సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

### జగనన్న సురక్షలో 12,534 ధ్రువీకరణ పత్రాల పంపిణీ

**దెందులూరు:** జగనన్న సురక్ష పేదలకు రక్ష అని దెందులూరు మండల సచివాలయాల కన్వీనర్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు అన్నారు. శుక్రవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల మండలాధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమిష్టి కృషితో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందని మండల సచివాలయాల కన్వీనర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ తరఫున ఏసుబాబు కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత



పెదపాడులో జగనన్న సురక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

**పెదపాడు:** అర్హులందరికీ నూరు శాతం సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. పెదపాడు గ్రామ సచివాలయం -1 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ కుల, మత, వర్గ బేధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పెదపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి సురక్ష కార్యక్రమంలో 14,410 సేవలు అందించినట్టు తెలిపారు. ఈ సురక్షా కార్యక్రమం విజయవంతం చేయడంలో కృషి చేసిన మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ భవనానికి నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రికి అందించామన్నారు. దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, సర్పంచ్ కొత్తూరు జీవన కుమారి, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, స్థానిక వైసీపీ నాయకులు గోకా శంకరరావు, రెడ్డి సతీష్, కొత్తూరు విమలారావు పాల్గొన్నారు.

**11,298 కుటుంబాలకు ధ్రువపత్రాల పంపిణీ**

**ఉంగుటూరు:** ఉంగుటూరు మండలంలో 27 సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష సభల్లో 11,298 కుటుంబాలకు వివిధ రకాలు సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్టు డీఎల్‌డీవో, మండల ప్రత్యేక అధికారి గుండవరపు వెంకటరమణ శుక్రవారం వెల్లడించారు. ఈ సభల ద్వారా 27,895 మందిని సర్వే చేసి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు. ఇందులో 476 మంది వలంటీర్లు సురక్ష సర్వేలో పాల్గొన్నారని తెలిపారు. ఆధార్ కేంద్రాలు ఏర్పాటుచేసి వాటి ద్వారా 700 మందికి సర్వీసులు అందజేశామని, ఆదాయ ధ్రువపత్రాలు 3,059 మందికి, కుల ధ్రువీకరణ పత్రాలు 4,668 మందికి, ఆర్వోఆర్ 1బి అడంగల్ 921 మంది రైతులకు, సీసీఆర్సీ కార్డులు 167 మంది కౌలురైతులకు పంపిణీ చేశామన్నారు. ఉపాధి హామీలో 3వేల మెక్కలను నాటినట్టు తెలిపారు. ఈ సభలలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటశ్రీలక్ష్మి, మండలస్థాయి అధికార్లు ఎంపీడీవో ఆంజనేయబాబు, తహసీల్దారు వెంకటరమణరావు, ఈవోపీఆర్డీ షంషుద్దీన్, డీటీ బి.దుర్గాప్రసాదు, మండలస్థాయి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారని డీఎల్‌డీవో రమణ వివరించారు.

**జగనన్న సురక్ష విజయవంతం**

**పెదవేగి :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచనతో మండలవ్యాప్తంగా 28,109 ధ్రువపత్రాలను అర్హులకు అందించామని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య చెప్పారు. మండలంలో జులై 1 నుంచి జూలై 28వ తేదీ వరకు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం అధికారులు, నాయకుల సహకారంతో విజయవంతమైందని ఆమె అన్నారు. శుక్రవారం వేగివాడ , దుగ్గిరాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమాల్లో ఎంపీపీ పాల్గొన్నారు. తహసీల్దార్ ఎస్ నాగరాజు, ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు 26 వేల గృహాల్లో సర్వే చేసి, 30,698 దరఖాస్తులు స్వీకరించామన్నారు. వాటిని పరిశీలించి 28,109 సర్టిఫికెట్లు లబ్ధిదారులకి ఆయా గ్రామసభల్లో అందించామన్నారు. సుమారు 84 కొత్త పనులను గుర్తించి జిల్లాలో ఎక్కువ సర్వీసులు, సర్టిఫికెట్లు అందించి పెదవేగి మండలం మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు, ఎమ్మార్వోలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. శుక్రవారం జగనన్న సురక్ష ఆఖరిరోజు దుగ్గిరాలలో 1085 సర్టిఫికెట్లు, వేగివాడలో 1,190 ధ్రువపత్రాలు అందజేశామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఏసీ భ్రమరాంబ, పంచాయతీ కార్యదర్శి ఆర్ సాయికృష్ణ, కొప్పాక సొసైటీ డైరెక్టర్ పులవర్తి దేవానంద్, ఎంపీటీసీ పులవర్తి సరోజిని, నాయకులు జాలా రాజీవ్, వేగివాడ సర్పంచ్ పంది ప్రభావతి సూర్యచంద్రరావు, ఎంపీటీసీ కొనకళ్ళ లక్ష్మీశ్రీనివాస్ పాల్గొన్నారు.

# పంట చేలను ముంచెత్తిన వరద



భీమడోలు : వడ్డిగూడెంలో కుళ్లిన నారు చూపుతున్న రైతులు



భీమడోలు : లక్ష్మీపురం వద్ద మేజర్ డ్రెయిన్‌లో పూడికతీత

**భీమడోలు:** కొల్లేరు శివారు ప్రాంతాలయిన భీమడోలు, ఎంఎంపురం, భోగాపురం, వడ్డిగూడెం ఏరియాల్లో పంట చేనులను ముంపు నీరు ముంచెత్తుతోంది. మండల పరిధిలో 450 ఏకరాల్లో వరి నాట్లు ముంపునకు గురి కాగా రెండో రోజు కూడా ఆ వరద నీరు కిందికి వెళ్లకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొల్లేరుకు వెళ్లే ప్రధాన డ్రెయిన్లు పూడుకుపోవడంతో పాటు ఆక్వా చెర్వుల ఆక్రమణల వల్ల ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన భారీ వరద నీరు కిందకు వెళ్లే మార్గం లేక వెనక్కి దన్నుతోంది. దీనితో వరద నీరు మోకాలు లోతు నిలిచి ఉంది. డ్రెయిన్ల పూడిక తీయించేందుకు సంబంధిత అధికారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే భీమడోలులోని 130 ఎకరాలు, ఎంఎంపురంలో 70 ఎకరాలు, గుండుగొలను శివారు భోగాపురం, వడ్డిగూడెం ఏరియాల్లో 250 ఎకరాల్లో పంట చేలు మునిగిపోవడంతో వరి నాట్లు కుళ్లిపోతున్నాయి.

**యుద్ధప్రాతిపదికన ముంపు నీరు తొలగింపునకు చర్యలు**

ఆగడాలలంక ఛానల్ పరిధిలో కొల్లేరు ప్రాంతానికి చెందిన గుండుగొలను ఆయకట్టు పరిధిలోని 250 ఎకరాల వరి చేలు ముంపుబారిన పడడంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. దీనితో అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ ఆ ప్రాంతాన్ని సందర్శించి మండలస్థాయి అధికారులు దిశానిర్దేశం చేసారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ పర్యవేక్షణలో ముంపు నీరును బయటకు పంపించేందుకు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం లక్ష్మీపురం వద్ద కొల్లేరులోకి నీటిని తరలించే ప్రధాన డ్రెయిన్ బొబ్బిలిలంకను జేసీబీల సాయంతో పూడిక తీసే పనులు చేపట్టారు. డ్రెయిన్ ద్వారా కొల్లేరులోకి నీరు వెళ్లే మార్గాన్ని బాగు చేసారు. త్వరలో సమస్య పరిష్కారమవుతుందని అధికారులు అంటున్నారు. ఏవో ఉషారాణి, గ్రామ నిర్వాహక కార్యదర్శి మురళీ, వీఆర్వో గోవింద్, మహిళా కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.



పెదవేగి : నారుమడిలోని ముంపు నీటిని తోడుతున్న రైతు

**నీట మునిగిన నారుమడులు**

**పెదవేగి:** మండల పరిధిలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నారుమడులు మునిగాయి. దీంతో వరి నాట్లు వేసే పరిస్థితి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే నారుమడులు ఏపుగా పెరిగాయని, ఎడతెరపి లేని వర్షాలతో ఇబ్బంది పడుతున్నట్టు రైతులు అంటున్నారు. దమ్ము చేసిన వరిచేలు నీట మునిగాయి. నీట మునిగిన నారుమడుల్లో ముంపు నీటిని తొలగించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ముంపు నీరు తొలగించకపోతే నారు కుళ్లిపోయే ప్రమాదముందని రైతులు అంటున్నారు.

## ‘ఆడుదాం ఆంధ్ర’.. విజయవంతం చేయాలి



దెందులూరు కార్యాలయంలో మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి అన్నమ్మ

**దెందులూరు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్రీడాభివృద్ధి, విద్యార్థుల్లో గ్రామ యువతలో మానసిక, శారీరక ధృఢత్వం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దెందులూరు విద్యాశాఖాధికారిణి అన్నమ్మ కోరారు. శుక్రవారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు జరుగుతాయన్నారు. ఈలోపు ప్రతి గ్రామంలోని పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, గ్రామస్థాయి ఆటల పోటీలను పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీనియర్, జూనియర్ విభాగాల్లో పాఠశాల విద్యార్థులతో పాటు గ్రామ యువతకు భాగస్వాములను చేసి 12 రకాల ఆటల పోటీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సహాయ సహకారాలతో సంయుక్తంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని పాఠశాలల్లోని క్రీడాప్రాంగణాల్లో పూర్తి చేయాలని ఎంఈఓ అన్నమ్మ కోరారు.

## గోగుంట సహకార సంఘం లాభాల బాట



సమావేశంలో మాట్లాడుతున్న గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ

**పెదపాడు:** ఏలూరు జిల్లాలో గోగుంట సహకార సంఘం లాభాలు ఆర్జించడంలో మొదటిస్థానంలో నిలిచిందని ఆ సంఘ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ తెలిపారు. పెదపాడు మండలంలోని గోగుంటలోని సహకార సంఘంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గతేడాడి జరిగిన లాభ నష్టాలు ఆడిట్ నివేదిక చదివి వినిపించారు. ఈ సమావేశంలో సహకార సంఘం అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎన్నడూ లేని విధంగా ఈఏడాది రూ.1,19,30,000 ఆర్జించినట్టు తెలిపారు. ఈ లాభాలను సంఘంలోని సభ్యులందరికి షేర్ క్యాపిటల్ ప్రకారం 18శాతం (నికర లాభంలో 45.13 శాతం) డివిడెండ్ అందిస్తున్నట్టు చెప్పారు. గతేడాది సభ్యులకు 17శాతం డివిడెండ్ అందించామని గుర్తు చేసారు. ఏలూరు జిల్లాలో మొదటి స్థానం సాధించడంతోపాటు పాత పశ్చిమగోదావరి జిల్లాల్లో ఉన్న సంఘాల్లో మూడో స్థానంలో నిలిచిందన్నారు.

## ప్రభుత్వ న్యాయవాదిగా నిమ్మల రాము



ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న లాయర్ నిమ్మల రాము

**నిడమర్రు:** అడవికొలను సొసైటీ మాజీ అధ్యక్షుడు, జిల్లా కోర్టు సీనియర్ న్యాయవాది నిమ్మల రాముని జిల్లా ప్రభుత్వ న్యాయవాదిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హరికృష్ణగుప్త శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసారు. న్యాయవాది నిమ్మల రామును జిల్లా కోర్టులోని నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీసీ) విభాగానికి సంబంధించిన కేసుల బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును లాయర్ రాము కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశం కల్పించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ఆళ్ల నానికి రాము ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాముని జెడ్పీటీసీ కోడేలశ్రీ, వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శి సంకు నాగశేషు తదితరులు అభినందించారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో విద్యార్థుల సందడి

**ఉంగుటూరు:** యువకులు కేరింతలు డ్యాన్సులు నడుమ నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. శుక్రవారం ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కార్యదర్శి సాగిరాజు జానికరామరాజు అభినందించారు. ప్రిన్సిపాల్ విశ్వేశ్వరావు మాట్లాడుతూ స్థానిక నాయకులు, దాతల సాయంతో కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఈ సమావేశంలో బొమ్మిడి అప్పారావు, డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టరు విజయరాజు, రిటైర్డ్ పీడీ ఆదిరెడ్డి సత్యనారాయణ, అధ్యాపకులు డా. కొండ రవి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## దోమతోనే వ్యాధుల వ్యాప్తి

**గణపవరం:** అన్ని వ్యాధులకు మూలం దోమలేనని, దోమల నివారణతో వ్యాధులకు దూరంగా, ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి గణపవరం మండలం చిలకంపాడు గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్రైడే- డ్రైడేగా పాటించాలని, దోమల వ్యాప్తి, నివారణ, దోమల నుంచి రక్షణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు పి.వెంకటనారాయణ, గ్రామ కార్యదర్శి ఆర్.స్రవంతి, ఆరోగ్యసహాయకుడు నామాలరాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## 30న కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సు

**పెదపాడు:** రైతాంగ సమస్యలపై ఈనెల 30న విజయవాడలో నిర్వహించనున్న కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తూరులో కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సు ప్రచార పోస్టర్లు కరపత్రాలను శుక్రవారం ఆయన విడుదల చేశారు.

## మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

**గణపవరం:** జాతీయ ఉపాధి హామీ పథకంలో శుక్రవారం మండలంలోని గణపవరం, జల్లికాకినాడ, అర్ధవరం, కోమర్రు, సరిపల్లె, వెంకట్రాజపురం గ్రామ పంచాయతీలలో మొక్కలునాటే కార్యక్రమం చేపట్టారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో మంచినీటి చెర్వుగట్లు, ఖాళీ ప్రదేశాలు, రోడ్ల పక్కన, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటారు. ఎంపీడీవో జ్యోతిర్మయి మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. గణపవరంలో సర్పంచ్ మూర అలంకారం, జల్లికాకినాడలో సర్పంచ్ బాతు నాగేశ్వరరావు, అర్ధవరంలో సర్పంచ్ గాతల సుజాత, సరిపల్లెలో చనుమూరి లక్ష్మీదుర్గ, కోమర్రులో కేశవరపు శైలజ, వెంకట్రాజపురంలో మల్లంపల్లి సురేష్‌తో పాటు ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# కొండేపాడును చుట్టుముట్టిన వరద నీరు



కొండేపాడులో లెవెల్ వంతెన వద్ద ఎర్రకాల్వలో జేసీబీతో తూడు తొలగింపు

**గణపవరం:** వర్షాకాలం వచ్చిందటే చాలు... గణపవరం మండలం శివారు గ్రామమైన కొండేపాడు ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తారు. భారీ వర్షాలు కురిసినా, ఎగువ ప్రాంతాల్లో వరదలు వచ్చినా, ఎర్రకాల్వ పొంగినా ఏటా ముందుగా ముంపునకు గురయ్యేది ఈ గ్రామమే. ఈ గ్రామానికి మూడువైపులా మూడు ప్రధాన మురుగుకాల్వలున్నాయి. వీటిలో ఎర్రకాల్వ వల్ల ఈ గ్రామానికి తరచూ ముంపు సమస్య తలెత్తుతుంది. ఎర్రకాల్వకు వరదలు వస్తే గట్లమీదుగా వరదనీరు గ్రామంలోకి ప్రవేశిస్తుంది. ఏటా ఎర్రకాల్వకు వరదలు వచ్చే సమయంలో ఈగ్రామం వెంబటి కాల్వ గట్లను మట్టి, ఇసుక బస్తాలతో అడ్డుకట్టలు వేస్తుంటారు. ఎర్రకాల్వపై ఈగ్రామం వద్ద బ్రిటిష్ కాలంలో నిర్మించిన లో లెవల్ వంతెన మునిగిపోయి గ్రామానికి రాకపోకలు నిలిచిపోతుంటాయి. ప్రస్తుతం నాలుగు రోజులుగా ఎర్రకాల్వ ఉగ్రరూపం దాల్చి వరదనీరు లో లెవల్ వంతెన శ్లాబును తాకుతూ ప్రవహిస్తోంది. ఇంకా వరద ఉధృతి పెరిగితే ఈవంతెన మునిగిపోతుంది. వంతెన వద్ద తూడు, గుర్రపుడెక్క పెద్ద ఎత్తున మేటలు వేయడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీనితో ఉపసర్పంచ్ శీతాలం పుల్లయ్యనాయుడు ఆధ్వర్యంలో జేసీబీతో లో లెవల్ వంతెన వద్ద పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగిస్తున్నారు. కొండేపాడులోని మురుగునీటిని ఎర్రకాల్వలోకి తీసుకువచ్చే రాజకోడు కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ మురుగుకాల్వకు యర్రకాల్వపై నిర్మించిన చెక్‌డ్యాంలు తుప్పుపట్టి, భారీ రంధ్రాలు ఏర్పడ్డాయి. ఎర్రకాల్వలో నీటిప్రవాహం ఇంకా కొద్దిగా పెరిగితే వరద నీరు రాజకోడులోకి ప్రవేశించి, ఐదారు గ్రామాలపై విరుచుకుపడే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే దాదాపు రెండు వందల ఎకరాల్లో వరదనీరు మోకాలి లోతున చేరి వరినాట్లు వేయడానికి వీలులేకుండా పోయింది. గ్రామంలోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

**ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం**

ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిస్తే కొండేపాడు గ్రామం ముంపునకు గురవుతుందని ఉపసర్పంచ్ శీతాలం పుల్లయ్యనాయుడు అన్నారు. సాగునీటి సమస్య ఏర్పడితే ముందుగా ఎండిపోయేవి మా పొలాలే. మా గ్రామంతో పాటు ఐదారు గ్రామాల్లోని మురుగునీటిని ఎర్రకాల్వకు చేర్చే మేజర్ డ్రైన్ అయిన రాజకోడుకు ఎర్రకాల్వపై నిర్మించిన షెట్టర్ తలుపులు తుప్పుపట్టి భారీ రంధ్రాలు పడ్డాయని తెలిపారు. ఎర్రకాల్వకు వరదనీరు ఇంకా పెరిగితే ఆ నీరు రాజకోడులోకి ప్రవేశించి ఐదారు గ్రామాలకు ముంపు సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. శిథిలమైన షెట్టర్ల విషయం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దృష్టికి తీసుకెళ్లామని ఆయన తెలిపారు.

**నూతన షెట్టర్లు ఏర్పాటుచేస్తాం**



ఎస్.కొండేపాడు గ్రామం వద్ద రాజకోడు మురుగు కాల్వకు ఎర్రకాల్వపై నిర్మించిన షట్టరు రేకులు తుప్పుపట్టి పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడినట్లు ఆగ్రామ సర్పంచ్, రైతులు తెలిపారు. దీనిపై సంబంధిత డ్రైనేజి శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే మరమ్మతులు లేదా, కొత్త షట్టర్లుకాని ఏర్పాటుచేయాలని ఆదేశాలుఇచ్చాం. ఈమేరకు అధికారులు షెట్టర్ కొలతలు తీసుకువెళ్లారు. త్వరగా నూతన షెట్టర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే